క్లుప్తంగా

జగన్ పాలనలోనే సామాజిక న్యాయం

మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకంగా పాలన చేస్తున్నారని, జగనన్న సీఎంగా ఉంటేనే సామాజిక న్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని బ్రహ్మపురంలోని తొమ్మిదో సచివాలయం పరిధిలో 16, 17 వార్డులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, మెట్ల సుబ్రహ్మణ్యం, ఉమ్మిటి తనూజ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి తెనాలికి చెందిన యార్లగడ్డ శేషకుమారి రూ. 51 వేల విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. శనివారం ఉదయం స్వామి వార్లను దర్శించుకున్న ఆమె ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు అన్నదానం

పెడన: అన్నదానం చాలా గొప్పదని ఇంటర్ విద్య విశ్రాంత జిల్లా అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సాయంతో వందమంది విద్యార్థులకు వంద రోజులు నిర్వహిస్తున్న ఉచిత మధ్యాహ్న భోజన పథకం శనివారంతో ఆరో రోజుకు చేరింది. రాధాకృష్ణమూర్తి విద్యార్థిని విద్యార్థులకు భోజన సౌకర్యం శనివారం కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల తన వంతు సాయంగా రూ.5 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనుబాబు, లైబ్రేరియన్ పేరిశెట్టి నాగరవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన

పెడన: పెడన మండలం నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కార్తిక వనసమారాధన, దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత కళాశాలలోని ఉసిరి చెట్టు కింద శివపార్వతులకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వనభోజనాలు, అనంతరం ఉపన్యాస కార్యక్రమాలు జరిగాయి. ఆధ్యాత్మికవేత్త, సంఘ సంస్కర్త భారతీయం సత్యవేణి కార్తికమాసం విశిష్టతను వివరించారు.

పాస్టర్లకు వస్త్రాల పంపిణీ

కోడూరు: శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని జయపురం ఫుల్ గాస్పెల్ చర్చిలో పాస్టర్లకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు వివిధ ప్రార్థనా మందిరాలకు చెందిన 25 మంది పాస్టర్లకు వస్త్రాలను అందించారు. క్రిస్మస్ కాలం ప్రారంభం కావడంతో దైవజనులకు వస్త్రాలను అందజేశామని శ్యామ్‌కిషోర్‌నాయుడు తెలిపారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలోని సువర్చల ఆంజనేయస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న స్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం పుణ్యాహవచనం, వాస్తు హోమాలు అనంతరం పలువురు దంపతులతో సామూహిక హనుమత్ వ్రతాలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన ద్వాదశ ప్రదక్షిణలు ఆకట్టుకున్నాయి. ఊంజల సేవ జరిగింది. ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి నిర్వహించిన శాంతి కల్యాణంలో పలు ప్రాంతాలకు చెందిన దంపతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నిధులు వినియోగించాలి

మోపిదేవి: గత రెండేళ్లుగా మండలానికి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 75 లక్షలు గ్రామాల అభివృద్ధి ఉపయోగించాలని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీడీఓ శ్రీనివాసరావును తన కార్యాలయంలో శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరువస్తుందని, వెంటనే నిధుల వివరాలు బయట పెట్టాలని కోరారు. కోసూరు వారిపాలెం ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్ బాబు, నాగాయితిప్ప సర్పంచ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చల్లపల్లి: ఈ ఏడాది ప్రతి ఎకరాకు గరిష్టంగా మూడు టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక పీఏసీఎస్ ఆవరణలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు, పరికరాలు పరిశీలించి పలు సూచనలు చేశారు.

లక్ష్మీ సుదర్శన హోమం

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగ స్వామి ఉత్సవాలు శనివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. వేదపండితులు లక్ష్మీసుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం సహస్ర లింగేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు జరిగాయి. భక్తబృందం ఆధ్వర్యంలో స్వామివారికి సంకీర్తన నిర్వహించారు.

అయ్యప్పల ఊరేగింపు

కృత్తివెన్ను: పల్లెపాలెం గ్రామంలో అయ్యప్ప మాలధారులు బంధువులతో కలిసి 108 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వాములంతా స్థానికంగా ఏర్పాటు చేసిన పడి పూజలో పాల్గొన్నారు.

పేదల జీవన విధానంలో మార్పు

- చరిత్ర పుటల్లో నిలిచేలా సీఎం జగన్ నిర్ణయం
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- లంక భూములకు పట్టాల పంపిణీ



మోపిదేవిలో లంక భూముల లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవి: పేదల జీవన విధానంలో మార్పు తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో సాహసోపేత నిర్ణయంతో చరిత్ర పుటల్లో నిలిచిపోతారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవిలో సీ క్లాస్ లంక భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మోపిదేవి, అవనిగడ్డ తహసీల్దార్లు కె. నవీన్‌కుమార్, రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పేదవాడికి అండగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి జీవన విధానం, కుటుంబంలో మార్పు తెచ్చారని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి అయిన నాలుగున్నరేళ్లలోనే ఒక్క మోపిదేవి మండలంలోనే సుమారు రూ.176 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. టీడీపీ, జనసేన కలయికలో నియోజకవర్గంలో జనసేనకు టిక్కెట్ రాకుండా చేయడానికి మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ కుయుక్తులతో ఇటీవల జనసేన నాయకులను వైఎస్సార్ సీపీ కార్యాలయంపైకి దాడికి పంపారని ఆరోపించారు. అలా దాడి చేసిన వారికి సన్మానాలు చేస్తూ జనసేన వారిచే గొడవలు చేయిస్తున్నారని, తద్వారా వారికి సీటు రాకుండా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వెనుకబడిన అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ నదీ గర్భంలో ఉన్న లంక భూములకు, 22ఏ చుక్కల భూములకు పట్టాలు రాకుండా నాడు చంద్రబాబు అడ్డుకుని ఆ రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. నేడు ముఖ్యమంత్రి జగనన్న ఆ భూములపై రైతులకు పూర్తి హక్కు వచ్చేలా చేశారని, లంక భూములను కూడా ఐదేళ్ల లీజుకు పట్టాలు ఇచ్చి తరువాతి కాలంలో రిజిస్ట్రేషన్ చేయించేలా అవకాశం కల్పించిన ఘనత సీఎం జగనన్నదే అని చెప్పారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ గాంధీ క్షేత్రం పేరున 99 సంవత్సరాల లీజు పేరుతో ప్రభుత్వ భూమిని తీసుకుని అందులో కల్యాణ మండపం నిర్మించి అద్దె వసూలు చేస్తున్నారని, పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ మాట్లాడుతూ మోపిదేవి, అవనిగడ్డ రెండు మండలాల్లోని లంక భూములు 1,141 మంది లబ్ధిదారులకు గాను 373.31 ఎకరాలకు పట్టాలు అందచేశామన్నారు. అందులో మోపిదేవి మండలం బొబ్బర్లంక పరిధిలో 134 మంది రైతులకు 55.56 ఎకరాలు, కె. కొత్తపాలెం పరిధిలో 788 మంది రైతులకు 195.68 ఎకరాలు, ఉత్తర చిరువోలులంక పరిధిలో 87 మంది రైతులకు 21.18 ఎకరాలు మొత్తం 1,009 మంది రైతులకు 272.42 ఎకరాలకు పట్టాలు అందచేశామని తెలిపారు. అవనిగడ్డ మండలంలోని వేకనూరు పరిధిలో 38 మంది రైతులకు 31.96 ఎకరాలు, పులిగడ్డ పరిధిలో 13 మంది రైతులకు 27.48 ఎకరాలు, పాతఎడ్లంక పరిధిలో 32 మంది రైతులకు 17.17 ఎకరాలు, దక్షిణ చిరువోలులంక పరిధిలో 49 మంది రైతులకు 26.28 ఎకరాలు మొత్తం 132 మంది రైతులకు 100.89 ఎకరాలకు పట్టాలు అందజేశామన్నారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ నందిగం మేరీరాణి, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల కన్వీనర్లు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, నాయకులు, లంక భూముల లబ్ధిదారులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు

న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు



మాట్లాడుతున్న న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రపంచ దేశాల్లో అన్ని రాజ్యాంగాల కన్నా భారత రాజ్యాంగానికి ఎంతో గుర్తింపు ఉందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లా డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం శనివారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగ ఉల్లంఘన జరిగినప్పుడు కోర్టులు రక్షణగా ఉంటాయని చెప్పారు. ప్రతి పౌరుడు హక్కులతో పాటు విధులను కూడా తెలుసుకోవాలన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ రామకృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య మాట్లాడారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు,చీలి మునలయ్య పాల్గొన్నారు.

లా కళాశాలలో..

భారతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం లా, డిగ్రీ కళాశాల విద్యార్థులు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం మనిషికి ఎంత అవసరమో తెలియజేస్తూ వాటికి పరిమితులు కూడా నిర్ధారించబడ్డాయన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ రామకృష్ణ, లా కళాశాల ప్రిన్సిపాల్ రాయలు, పద్మావతి కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, మాజీ ప్రభుత్వ న్యాయవాది అజ్మతున్నీసా పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

ఎస్ఐ సుబ్రహ్మణ్యం

నాగాయలంక: మహిళలు హింసకు గురికాకుండా రక్షణ పొందేందుకు అనేక చట్టాలు ఉన్నాయని, మహిళలు వాటిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ ఎం. సుబ్రహ్మణ్యం అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నాగాయలంకలోని దివిసీమ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించాలన్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు దాటితేనే వివాహాలు చేయాలని చెప్పారు. పలు చట్టాలను వివరించారు. ఏపీఎం కడవకొల్లు ఏసుదాసు, మండల సమాఖ్య ప్రెసిడెంట్ ఎం.లంకేశ్వరి, కార్యదర్శి ఆర్.దుర్గాప్రసన్న, బి.లక్ష్మీకుమారి, 43 గ్రామ సంఘాల ప్రెసిడెంట్స్, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు..

చల్లపల్లి: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బి.అమలేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జెండర్ ఆధారిత వివక్ష నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అమలేశ్వరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

జెండర్ ఆధారిత హింసను అరికట్టాలి..

మోపిదేవి: జెండర్ ఆధారిత హింసను అరికట్టాలని డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ జరిగింది. డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ బాలకలపై అత్యాచారాలు, మహిళలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామని చెప్పారు. డ్వాక్రా సంఘాల వీఓలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి జోగి రమేష్



బ్రోచర్ అందజేసి పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

బంటుమిల్లి: ప్రజా సమస్యలతో పాటు గ్రామ, పట్టణ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు మీ వద్దకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని చోరంపూడి పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి బ్రోచర్లను అందజేశారు. ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి దృష్టికి పలు సమస్యలను గ్రామస్తులు తీసుకువచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. తప్పకుండా ఆయా సమస్యలను పరిష్కరిస్తానని వారికి మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలివెల చినబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఓడిమి చిన్నారిబాబు, ఎంపీటీసీలు తిరుమలశెట్టి లక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె స్వర్ణభారతి పాల్గొన్నారు.

దళిత మోర్చా బైక్ ర్యాలీ

మచిలీపట్నంటౌన్: దళిత మోర్చా ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానందం ఆధ్వర్యంలో లక్ష్మీటాకీస్ సెంటరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గుప్తా సెంటరులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

వసతిగృహాల తనిఖీ

అవనిగడ్డ: స్థానిక ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను జిల్లా ఖజానాధికారి రవికుమార్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరుశాతం, ఎంతమందికి వంట చేస్తున్నది, ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తయారు చేసిన భోజన పదార్థాలను ఆయన పరిశీలించారు. తొలుత సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు, కంప్యూటర్‌లో వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

కార్తిక స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు

తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా

కోడూరు: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని హంసలదీవి సాగరతీరంలో కార్తిక స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగే కార్తిక స్నానాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కృష్ణా సాగర సంగమం వద్దకు భక్తులను అనుమతించేది లేదన్నారు. పుణ్య స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. స్నానాలకు వచ్చేవారిని దింటిమెరక-పాలకాయతిప్ప మీదుగా సముద్ర ప్రాంతానికి అనుమతిస్తామని, స్నానాల అనంతరం భక్తులను హంసలదీవి, ఉల్లిపాలెం మీదుగా పంపనున్నట్లు చెప్పారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో సముద్రంలో మరబోట్లు, గజ ఈతగాళ్లతో పర్యాటకులకు భద్రత కల్పించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. వైద్య శిబిరాలు, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు భక్తులకు అవసరమైన తాగునీటిని అందించనున్నట్లు ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం చెప్పారు. హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుడి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని శృంగేరీ పీఠం ప్రతినిధులు తెలిపారు.

తుమ్మలపాలెంలో..

గూడూరు: గూడూరు మండలం తుమ్మలపాలెంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. సర్పంచి కోడే రేణుకాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధు, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్లం పెదబాబు, నాయకులు కోడే వెంకటేశ్వరరావు, బత్తిన త్రినాథ్, వి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల సమాచారంతో సిద్ధంగా ఉండండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి. రాజాబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న జిల్లా ఎన్నికల పరిశీలకులు బి. శ్రీధర్ రానున్నారని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు, సలహాలు ఉంటే తెలియజేయవచ్చునన్నారు.

కార్తిక కాంతులు



నాగాయలంక/మోపిదేవి: కార్తిక మాసం సందర్భంగా శనివారం నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రంలో శివయ్య, నందీశ్వరులకు నవ హారతులు సమర్పించారు. కోటి వత్తుల దీపారాధాన పీఠం, ఓంకారం, త్రీ ఆకృతులపై కార్తిక దీపాలు వెలిగించారు. మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో దీపారాధనలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

డిసెంబర్ 26 నుంచి భారత్ సంకల్ప యాత్ర

పెడన: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 26 నుంచి పెడన మండలంలో భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు జరుగుతాయని పెడన ఎంపీడీఓ వి. రెడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 26న నడుపూరులో ప్రారంభమై 2024 జనవరి ఏడో తేదీన నందమూరుతో ముగుస్తుందని చెప్పారు. భారత సంకల్పయాత్ర వాహనంలో ముగ్గురు సిబ్బంది ఉంటారని, వారు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు క్షయవ్యాధికి సంబంధించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. టీబీ లక్షణాలుండే వారిని గుర్తించి తగు చికిత్స అందించడంతో పాటు వారికి మందులను పంపిణీ చేస్తారని చెప్పారు. ఉజ్వల స్కీం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అర్హులకు రిజిస్ట్రేషన్ చేయడం, పీఎం సందేశం వినిపించడం, ప్రతిజ్ఞ చేయించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. క్విజ్ పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చల్లపల్లి: గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు అన్నారు. చల్లపల్లి-3 గ్రామ సచివాలయం పరిధిలో రెండు ఎస్సీ కేటగిరీ పోస్టులు, చల్లపల్లి-2 గ్రామ సచివాలయం పరిధిలో ఒక బీసీ కేటగిరీ పోస్టు, లక్ష్మీపురం గ్రామ సచివాలయం-1 పరిధిలో ఒక ఓసీ కేటగిరీ పోస్టు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 2వ తేదీన పరిశీలన, ఇంటర్వ్యూలు, 4వ తేదీన ఎంపిక, నియామకాలు, 5వ తేదీన శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు.

- **కృత్తివెన్ను:** మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చిన పాండ్రాక-1 ఓసీ మహిళ 1, చినగొల్లపాలెం -1 బీసీ ఏ పురుషులు 1, బీసీ ఏ మహిళ 1, ఇంతేరు బీసీ ఏ మహిళ 1, కృత్తివెన్ను బీసీ ఏ మహిళ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

జాతీయ విప్రో ఎర్తియన్ పోటీలకు ఎంపిక

నాగాయలంక: ఆన్‌లైన్‌లో జరిగిన జాతీయ స్థాయి విప్రో ఎర్తియన్ పోటీలకు నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు సమర్పించిన ప్రాజెక్ట్ ఎంపికైందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వనమా రామకృష్ణ శనివారం తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు మత్తి వెంకట లిప్సిక, తరకటూరి లాస్యసాయి, తుంగల అవంతిక, బండ్రెడ్డి చాందిని, కైతేపల్లి ఉమామహేశ్వరి, తోవుల యశస్విని సంయుక్తంగా ఆన్‌లైన్‌లో సమర్పించిన 'బయో డైవర్సిటీ-ది మోర్ వెరైటీ-ది బెటర్ సొసైటీ' ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్పొరేట్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్టులు సమర్పించగా న్యాయ నిర్ణేతలు ఏడు ఉత్తమ ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ


పెడన: దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన హిందీ పరీక్షల్లో పెడన మండలం బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ శనివారం తెలిపారు. మధ్యమ పరీక్షకు 36 మంది హాజరవ్వగా ప్రథమ శ్రేణిలో 25, ద్వితీయ శ్రేణిలో 11 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. రాష్ట్రభాష పరీక్షకు ఆరుగురు హాజరవ్వగా ఆరుగురూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రవేశిక పరీక్షకు 12 మందికి గాను 11 మంది ప్రథమ శ్రేణిలోను, ఒకరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని వివరించారు.

ఆర్టీసీ కార్గో ద్వారా రూ.1000 కోట్ల ఆదాయం లక్ష్యం

ఆర్టీసీ డైరెక్టర్ ఎ.రాజారెడ్డి

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో కార్గో సేవలను మరింత విస్తృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని ఆర్టీసీ డైరెక్టర్ ఎ.రాజారెడ్డి అన్నారు. కార్గో సేవలను విస్తృతం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మచిలీపట్నం డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి వాణిశ్రీ అధ్యక్షతన డిపోలోని గ్యారేజీలో అధికారులు, ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం కార్గో ద్వారా ఆర్టీసీకి రూ.200 కోట్ల మేర ఆదాయం వస్తోందని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో దీనిని వెయ్యి కోట్లకు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా 24 గంటల్లోపే కార్గో అందేలా ఆర్టీసీ పనిచేస్తోందన్నారు. మరే ఇతర సంస్థలు ఇంత వేగంగా కార్గో అందించలేవన్నారు. తక్కువ సమయంలో తక్కువ రేట్లకు ఆర్టీసీ మాత్రమే కార్గో సేవలు అందిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి జీతాలను చెల్లిస్తున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు సమష్టి కృషితో కార్గో సేవల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఆర్టీసీ కర్నూలు డెప్యూటీ సీటీఎం రమణ, గుంటూరు ఏటీఎం సురేష్, డిపో మేనేజర్ టి.పెద్దిరాజు మాట్లాడారు.

చంద్ర కుటుంబానికి రూ. 1.05 లక్షల చెక్కు అందజేత



మోపిదేవి: ఆర్థిక పరిస్థితుల వల్ల ఇటీవల ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్టు కోళ్లపల్లి చంద్ర కుటుంబానికి చెన్ను రంగారావు ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ సర్కిల్ ఎస్సీ సెల్ నాయకులు మద్దాల వీరాస్వామి రూ. 1,05,000 చెక్కును అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా జర్నలిస్టు ప్రతినిధులకు అందజేశారు. మోపిదేవిలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను కలిసి చెక్కును బాధిత కుటుంబానికి అందజేయాలని కోరారు. బాధిత కుటుంబానికి బాసటగా నిలిచిన రంగారావు, వీరాస్వామిలను ఎమ్మెల్యే సింహాద్రి అభినందించారు.

కార్నియాల సేకరణ

చల్లపల్లి: చల్లపల్లి గ్రామానికి చెందిన ఆకుల వెంకయ్య శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావును సంప్రదించారు. తద్వారా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్య సిబ్బంది శనివారం ఉదయం గ్రామానికి వచ్చి ఆకుల వెంకయ్య నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి తరలించారు.

లక్ష్మీపురంలో సంకల్పయాత్ర

కృత్తివెన్ను: లక్ష్మీపురం సచివాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న పథకాలను సభలో వివరించారు. కేంద్రం నుండి వస్తున్న నిధులకు తోడు రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని నిధులను జోడించి చేస్తున్న అభివృద్ధిని తెలిపారు. అనంతరం ప్రధాన మంత్రి ఆరోగ్య కార్డులను అందించారు. ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, సర్పంచ్ పులగం సుబ్రమణ్యం, ఎంపీడీఓ పిచ్చిబాబు పాల్గొన్నారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వంటగదిలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. వంటగదిలోని విద్యుత్ మీటర్, మెయిన్ ఉన్న చోట నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి పీఎస్‌వీవీ ప్రసాద్ నేతృత్వంలో మంటలను అదుపు చేశారు. వంటగదిలో నిండుగా ఉన్న గ్యాస్ సిలిండర్ల వరకు మంటలు వ్యాపించకుండా అదుపు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్రీడాకారులకు శిక్షణ

గూడూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. డిసెంబరు 15 నుంచి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహించనున్నారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి మత్తి అరుణ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.